ప్రజాపాలన విజయోత్సవాలు



యాదారంలో ప్రజాపాలన కళాయాత్ర

శామీర్‌పేట్/మేడ్చల్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు 2024లో భాగంగా మేడ్చల్ జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల రెండు బృందాలు ప్రజాపాలన కళాయాత్ర బుధవారం మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో కొనసాగింది. మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్, సైదోనిగూడ, సోమారం గ్రామాల్లో అలాగే శామీర్‌పేట మండలంలోని యాడారం, మురహారిపల్లి, లాల్‌గడి మలక్‌పేట గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, పద్మ, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కీసర: కరీంగూడ నుంచి ఓఆర్ఆర్ వరకు 100 అడుగుల రహదారి విస్తరణలో భాగంగా కీరంగూడ గ్రామ ప్రధాన రహదారిలో కొంత మంది ఇండ్లు కోల్పోతున్నారు. దీంతోపాటు ప్రాథమిక పాఠశాల భవనం కూడా తొలగించాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారని గ్రామస్తులు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇండ్లు కోల్పోతున్నవారితో పాటు, విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలుగకుండా న్యాయం చేయాలని వారు కోరారు.

రమణీయంగా రుక్మిణీ పాండురంగ కల్యాణం



కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెములలో బుధవారం రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం రమణీయంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి చైర్మన్ కొండల్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వైభవాన్ని వీక్షించారు. రుక్మిణీ సహిత పాండురంగ స్వామి ఆశీస్సుల కోసం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్, వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



కలెక్టర్ గౌతమ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్

మేడ్చల్: మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నర్సింహులు యాదవ్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రును కలిశారు. అంతాయిపల్లిలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలెక్టర్ గౌతమ్‌ను, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిను కలిశారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం సహకారం అందించాలని కోరారు.



గ్రంథాలయ వారోత్సవాలు

కీసర: గ్రంథాలయ వారోత్సవాలు 2024-2025 సందర్భంగా బుధవారం కీసర ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో గల ఓల్డ్ కలెక్టరేట్ భవనంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిబాపూలే బాలికల (బాలానగర్, సనత్‌నగర్‌కు) పాఠశాల ప్రాంగణంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల హైదరాబాద్ రీజనల్ ఆర్డినేటర్ ఆదిత్యవర్మ, కీసర సీఐ వెంకటయ్యలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పఠనాశక్తి పెంపొందించుకునే విధంగా అమూల్యమైన సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, లైబ్రేరియన్ నాగలక్ష్మీ, శ్వేత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో ఆదిత్యవర్మ, సీఐ వెంకటయ్య

అవినీతి తిమింగలాలు!

నగర శివారు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలన్న విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు. భవిష్యత్‌లో జరగరాని ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులనే విషయాన్ని కూడా ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. – సాక్షి,సిటీబ్యూరో

- టౌన్‌ప్లానింగ్, జీపీల్లో చేతివాటం ప్రదర్శిస్తున్న పలువురు ఉద్యోగులు
- పురపాలక సంఘాలు, పంచాయతీల్లో అక్రమ కట్టడాల జోరు
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- జీహెచ్ఎంసీ సర్కిళ్లలోనూ పార్కుల కబ్జా
- అటకెక్కిన పర్యవేక్షణతో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ నిర్మాణాలు





ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనతో...

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల విచారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు క్షేత్ర స్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టాయి. మేడ్చల్ జిల్లాలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు, లే అవుట్లతోపాటు రోడ్లు, పార్కులను కబ్జా చేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్లు వెలుగులోకి వస్తున్నాయి. పనుల ఒత్తిడి, పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించకపోవటంతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పెద్ద మొత్తంలో వసూళ్లు

నిర్మాణదారుల నుంచి అడ్డగోలుగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్న అమ్యామ్యాలను పర్సెంటేజీల రూపంలో టౌన్‌ప్లానింగ్, ఎంపీఓలు నుంచి మొదలుకొని పురపాలక, పంచాయతీ శాఖ అధికారుల వరకు వెళ్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంచర్లలో ఎకరానికి రూ. లక్ష నుంచి ఏరియాను బట్టి రూ.3 లక్షల వరకు పలువురు ఉద్యోగులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు.. మచ్చుకు కొన్ని..

శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాల పరిధిలోని లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, మజీద్‌పూర్, దేవరయాంజల్, కోల్తూర్ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్, అక్రమ వెంచర్లు వెలిసినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్‌లో ప్రతీ రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నాయి. పురపాలికల్లో ఇటీవల విలీనమైన గ్రామ పంచాయతీలతో పాటు ప్రస్తుత జీపీల్లో కూడా అక్రమ కట్టడాలు, లే అవుట్లు కొనసాగుతున్నాయి. శామీర్‌పేట్, బొమ్మరాసిపేట మూడుచింతలపల్లి, తుర్కపల్లి, బాబాగూడ, అంకిరెడ్డిపల్లి, భోగారం, కీసర, చీర్యాల, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, యాద్గార్పల్లి, అలియాబాద్, లింగాపూర్ తండా, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం, నూతనకల్లు, రాయిల్పూర్, సైదోనిగడ్డ తండాలలో పెద్ద ఎత్తున అక్రమ కట్టడాలు, లేఅవుట్లు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు.

గుర్తించిన అక్రమ కట్టడాలివే

మేడ్చల్ జిల్లాలో గతంలో గుర్తించిన అక్రమ కట్టడాల వివరాలు పురపాలక సంఘాల వారిగా ఇలా ఉన్నాయి. నాగారంలో 12 అక్రమ లేఅవుట్లు, బోడుప్పల్‌లో 107, పీర్జాదిగూడలో 67, దమ్మాయిగూడలో ఏడు, మేడ్చల్‌లో 10, నిజాంపేట్‌లో 20, కొంపెల్లిలో 11, దుండిగల్‌లో 12,, తూముకుంటలో 15, పోచారంలో 12, ఘట్కేసర్‌లో 8, కీసర మండలంలో 265, శామీర్‌పేట్‌లో 185, మేడ్చల్లో 72, ఘట్ కేసర్‌లో 67, ఎంసీపల్లి మండలంలో 89 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు.

సర్కిళ్ల పరిధిలోనూ..

మేడ్చల్ జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో కూ డా పార్కులు, రోడ్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలిసినట్లు గుర్తించారు. జిల్లాలోని ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాలు, కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాలు, మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20, కూకట్‌పల్లిలో 455, కుత్బుల్లాపూర్‌లో 62, గాజుల రామారంలో 198 , అల్వా ల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉన్నా దందా మాత్రం ఆగటం లేదు.

మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీసీపీ

మేడ్చల్‌రూరల్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు, వారి కుటుంబీకులు ఉచిత మెగా మెడికల్ మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబీకుల కోసం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ అండ్ ఎస్సీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా మెడికల్ క్యాంపు బుధవారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబంతో కలిసి అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జోన్ల వారిగా డిసెంబర్ 23 వరకు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్, పేట్ బషీరాబాద్ ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ఇన్‌స్పెకర్ సత్యనారాయణ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రమీల, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: నేడు కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. 11కేవీ సీఎంఆర్ ఫీడర్, 33/11 కేవీ ఐడీఏ కండ్లకోయ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపుతోపాటు మరమ్మతుల కారణంగా సీఎంఆర్ కళాశాల, గంగాకావేరి సీడ్ కంపెనీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్, సుతారిగూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శామీర్‌పేట్: బీదర్, గుల్బర్గా గ్యాంగ్‌స్టర్‌లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లోని స్వెట్టర్, వెచ్చటి దుప్పట్లు, బెడ్ షీట్లు, ఇతర దుస్తులు అమ్ముతున్న వ్యక్తుల ముఠా నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. బీదర్, గుల్బర్గాలోని గ్యాంగ్‌స్టర్‌లు, ముఠా సభ్యులు దుప్పట్లు అమ్మేవారిగా నటిస్తూ.. చవకై న వస్తువులను విక్రయించే పేరుతో ఇండ్లు, దుకాణాలు మొదలైన వాటిలో రెక్కి నిర్వహించి అదును చూసి దోపిడికి పాల్పడుతారని వివరించారు. కావున ప్రజలు ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

మేడ్చల్: మేడ్చల్ ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అధికారులను ఆదేశించారు. ఐటీఐ కళాశాలలను అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా మార్చేందుకు నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ పనులను అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ట్రెనింగ్ సెంటర్‌లో 6 ట్రేడింగ్ విభాగాలకు ఆరు గదులు కేటాయించి మిషనరీ అమర్చాలని సూచించారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు.

ఇద్దరు ఎన్యుమరేటర్ల సస్పెండ్.



సర్వే అప్‌లోడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కులగణన సర్వే వివరాలను అప్‌లోడ్ చేస్తున్న ఆపరేటర్ల వద్ద లేని ఇద్దరు ఎన్యుమరేటర్లను సస్పెండ్‌చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ మల్లారెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్న సెంటర్‌ను ఆయన పరిశీలించి అప్‌లోడ్ విధానంను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో ఆపరేటర్ల పక్కన వివరాలు చెప్పేందుకు ఇద్దరు ఎన్యుమరేటర్లు లేకపోవడంతో వారిని సస్పెండ్ చేయాలని ఆయన స్థానిక అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ శైలజ, కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీఓ సంపూర్ణ తదితరులు ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చేయాలని వినతి

మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో నిలిపేలా తగు ఆదేశాలు ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కోరుతూ.. మంత్రికి ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలను వెంటనే పూర్తి చేయించాలని, కరోనా సమయంలో విలేఖరులకు నిలిపివేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. మేడ్చల్ స్టేషన్‌లో కృష్ణ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం, నర్సాపూర్, దేవగిరి, జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మేడ్చల్‌లో నిలపాలని కోరారు. మేడ్చల్ పరిధిలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లిలో నిర్మిస్తున్న ఆర్‌యూబీల పనులు మెల్లగా నడుస్తున్నాయని, త్వరగా పూర్తి చేయించాలని కోరారు. మేడ్చల్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-ఘట్‌కేసర్ రూట్‌ల మధ్య ఎంఎంటీఎస్ ట్రైన్‌ల సంఖ్య పెంచాలని, సమయాపాలన పాటించేలా చూడాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ ఈటల రాజేందర్ కోరారు.



మాలల మహాపాదయాత్ర

శామీర్‌పేట్: ఓటు బ్యాంకు కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల మాదిగల మధ్య వ్యత్యాసాన్ని తీసుకు వస్తున్నారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. మాలలపై జరుగుతున్న అసత్య ప్రచారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహాపాదయాత్ర బుధవారం శామీర్‌పేట మండలానికి చేరుకోగా.. మాల మహానాడు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం శామీర్‌పేట, ఉప్పర్‌పల్లి, అంతాయిపల్లి మీదుగా కీసర మండలానికి పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, మాలలపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నాగరాజు, దళిత సేన మండల అధ్యక్షుడు మురళి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



గొర్రెల పెంపకం దార్ల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి,సిటీబ్యూరో: గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌కు సంఘం జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. గొర్రెల పంపిణీలో అవినీతి సాకుతో ఏడాదిపాటు కాలయాపన చేసిన ప్రభుత్వం మూడేళ్ల కిందట గొర్రెల కోసం చెల్లించిన డీడీలను వాపస్ చేయటం వల్ల గొల్ల, కురుమలు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపోతున్నప్పటికి ప్రభుత్వం నుంచి స్పందన, ఎలాంటి పరిహారం అందటంలేదన్నారు. గొర్రెల పెంపకం దార్ల సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా నాయకులు కోమురయ్య, కుమార్, గోపాల్, వీరేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఆప్టికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆప్టికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఆప్టోమెట్రిస్ట్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామిని నూతనంగా ఎన్నికై న ఆప్టోమెట్రిస్ట్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారు డీఎంహెచ్‌ఓను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆప్టోమెట్రిస్ట్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కోయ అజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పరేష్, కోశాధికారి నరేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు అనిత, శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఉన్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

పోచారం: సెంట్రింగ్ సామగ్రి చోరీకి గురైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జోడిమెట్ల వద్ద నిర్మాణంలో ఉన్న ఏస్ అపార్ట్‌మెంట్స్‌లో సైట్ ఇంజనీర్‌గా మురళీ గణేష్, సూపర్‌వైజర్‌గా మహ్మద్ ఇమ్రాన్ పనిచేస్తున్నారు. ఇమ్రాన్ సమర్థవంతంగా పనిచేయకపోవడంతో ఆరు నెలల క్రితం విధుల నుంచి తొలగించారు. ఈ నెల 26న స్లాబ్ పనిచేస్తుండగా 50 సెంట్రింగ్ బాక్సులు, కొన్ని సెంట్రింగ్ ప్లేట్లు, బోల్టులు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరికి గురైన సామగ్రి గురించి సెక్యూరిటీ సిబ్బందిని అడిగితే ఈ నెల 24న రాత్రి 11 గంటల సమయంలో ఇమ్రాన్ టాటా ఏసీ ఆటోలో వచ్చి వెళ్లాడని చెప్పాడు. సెంట్రింగ్ సామగ్రిని ఇమ్రాన్ దొంగిలించినట్లు మురళి గణేష్ గుర్తించి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. అపహరణకు గురైన సామగ్రి విలువ సుమారు రూ. 2.5 లక్షలు ఉంటుంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు పండుగను విజయవంతం చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజాపాలనా-ప్రజా విజయోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు జరిగే రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ రైతు పండగ కార్యక్రమానికి ఈ నెల 29న మేడ్చల్ జిల్లా నుంచి 200 మంది రైతులను బస్సుల్లో తీసుకెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతు పండుగ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో రైతులు తిలకించేందుకు వివిధ కంపెనీలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు.అలాగే, వ్యవసాయ పంటల సాగు తదితర అంశాలపై వర్క్ షాపు, శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్టులు ఉంటాయన్నారు.

వైభవంగా గంధాభిషేకం



స్వామివారు, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న భక్తుడు



కీసర: కీసరగుట్ట శ్రీరామ లింగేశ్వరుడికి బుధవారం అర్చకులు గంధాభిషేకం పూజను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం పూజ అనంతరం స్వామివారికి గంధాభిషేకం పూజను నిర్వహించారు. కీసరగుట్ట దేవస్థానానికి కూకట్‌పల్లికి చెందిన భక్తుడు వెంకటేష్.. స్వామివారు, అమ్మవార్ల చిత్రపటాన్ని దేవాలయానికి బహుకరించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-PRINCIPAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
M.V.O.P.NO.62 OF 2023
BETWEEN:
SURANA SURAMMA
And others ...PETITIONERS
AND
A.ANDALU
And others ...RESPONDENTS
To
R-3 RAJA SHEKAR, S/o not known, Aged about 36 years, Occ: Private job, R/o Kondlakoya, Medchal, Medchal-Malkajgiri District-501401 (Rider of Motor Cycle bearing No.TS08GG9730)
R-5 SURA ANDALU, W/o Haribabu, Aged about 35 years, Occ: Private job, R/o Kondlakoya, Medchal, Medchal-Malkajgiri District-501401 (Rider of Motor Cycle bearing No. AP 28 BU 3714)
NOTICE
The Petitioner herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1989 and Rule 475/1 B of A.P.M.V.Rules, 1989 against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above OP and the matter is posted to 10.12.2024 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
Sd/- G. RATHNAM REDDY, Advocate
11-6-227, Pochamma Bagh, Beside GHMC Office, Saroornagar, Ranga Reddy District.
Cell No.9912658614

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387